


**మైనింగ్ తవ్వకాలతో ప్రకృతి విధ్వంసం..ప్రజల ప్రాణాలకు ముప్పు**


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 23 అక్టోబరు , 2026 | పేజీలు : 4


# నీటిని పొదుపుగా జాగ్రత్తగా వాడుకుందాం

### నీటి వనరులపై ఆడిట్ నివేదికలు సమర్పించాలని ఆదేశం కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ:** ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ప్రజలు నీటికి ఇబ్బందులు పడకుండా ఉన్న నీటిని జాగ్రత్తగా,పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు నీటి సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన తన చాంబర్ లో ఆర్డబ్ల్యూఎస్,మిషన్ భగీరథ,ఇరిగేషన్,విద్యుత్,పంచాయతీరాజ్,పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులతో పాటు శాస్త్రవేత్తలతో ఎల్ నినో కారణంగా భవిష్యత్తులో తాగునీటి పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ ప్రొఫసర్ సతీష్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం వల్ల తాగునీరు,సాగునీరు,విద్యుత్తు, వ్యవసాయం తదితర రంగాలపై ప్రభావం ఉంటుందని అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 7 మండలాల్లో సాధారణ వర్షపాతం ఉన్నప్పటికీ రాబోయే రోజుల్లో నీటి స్థాయిలు తగ్గే అవకాశం ఉందని అన్నారు.దీనిని దృష్టిలో ఉంచుకొని నీటిని పొదుపుగా,జాగ్రత్తగా వాడుకోవడం,అదే సమయంలో నీటి సంరక్షణ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.ఇందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తు తాగునీరు వృధా లేని గ్రామాలను, ప్రాంతాలను గుర్తించి వాటిని నీటి వృధా లేని గ్రామాలు, జోన్లుగా ప్రకటించాలని చెప్పారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్, ట్రాన్స్ కో అధికారులు హాజరయ్యారు.



## బస్సు ఎక్కేదెట్లా...

### తిరుగు ప్రయాణంలో తిప్పలు..

### కిక్కిరిసిన బస్సులు..ప్రయాణికుల అవస్థలు

**ప్రజాపక్షం/నకిరేకల్:** బతుకమ్మ,దసరా సెలవులు ముగియడంతో సొంతూళ్ల నుంచి తిరుగు ప్రయాణమైన ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నేటినుంచి విద్యార్థులకు పాఠశాలలు పునఃప్రారంభం కావడం, ఉద్యోగులు విధులకు వెళ్లాల్సి రావడంతో నకిరేకల్ కూడలిలో రద్దీ విపరీతంగా పెరిగింది.సూర్యాపేట,కోదాడ,విజయవాడ,ఖమ్మం,మణుగూరు భద్రాచలం,సత్తుపల్లి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతుండటంతో బస్సు ఎక్కేందుకు జనం నానా అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు వాహనాల ఛార్జీలు అధికంగా ఉండటంతో బస్సులపైనే ఆధారపడుతున్నారు. అదనపు బస్సులు నడుపుతున్నా రద్దీ తగ్గకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి.

# పాడుబడకముందే పట్టించుకోండి..

### 44 రోజులుగా నిరుపయోగంగా 30 పడకల ఆసుపత్రి

### విశాలమైన భవనాలు..స్థలం అందుబాటులో ఉన్నా వృథానే

### ప్రభుత్వ కార్యాలయాలకైనా కేటాయించాలని స్థానికుల సూచన



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నిన్నటి వరకు రోగుల రాకపోకలు,వైద్యుల పర్యవేక్షణతో కళకళలాడిన ఆ భవనం..నేడు బోసిపోయి కనిపిస్తోందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.దశాబ్దాలుగా ఎంతోమందికి ఆరోగ్య నిలయంగా నిలిచిన పాత 30 పడకల ఆసుపత్రి భవనం ప్రస్తుతం ఆదరణ కరువై నిరుపయోగంగా మారడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నకిరేకల్ ప్రజలకు మరింత మెరుగైన ఉచిత వైద్యం అందించేందుకు 100 పడకల ఆధునిక ఆసుపత్రిని నిర్మించడం పట్ల హర్షం వ్యక్తమవుతున్నప్పటికీ,లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన పాత భవనాన్ని పాడుబడనివ్వకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

**నన్ను వాడుకుంటే ఉపయోగం ...లేకుంటే నిరుపయోగం...**

నకిరేకల్ పట్టణ కేంద్రంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు నిలిచిపోయి నేటికి సరిగ్గా 44 రోజులు దాటుతోంది.సెప్టెంబరు 5న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నూతనంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రి ప్రారంభమవ్వడంతో,రోగుల సేవలను పూర్తిగా అక్కడికే తరలించారు.దీంతో పాత భవనం ఖాళీగా మారి నాథుడే లేకపోవడంతో భవన ప్రాంగణమంతా చెత్తా చెదారం చేరుతోందని, పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

**ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయిస్తే ఉపయోగం**

పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ ఆసుపత్రి ప్రాంగణంలో విశాలమైన భవనాలు,విడివిడిగా గదులు,తగినంత ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నాయని ప్రజలు గుర్తుచేస్తున్నారు.చిన్నపాటి మరమ్మతులు,మార్పులు చేపడితే ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ఇది ఎంతో అనుకూలంగా మారుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వ శాఖలకు దీనిని కేటాయిస్తే, బస్టాండ్ మరియు ప్రధాన రహదారికి సమీపంలో ఉండటం వల్ల తమకు కూడా సేవలు పొందడం సులభతరమవుతుందని సూచిస్తున్నారు.

**సద్వినియోగానికి విజ్ఞప్తి**

ప్రజాధనంతో నిర్మించిన ఈ ఆస్తులను ఇలాగే వదిలేస్తే కొద్దిరోజుల్లోనే భవనం శిథిలమయ్యే ప్రమాదం ఉందని,రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.భవనం పూర్తిగా పాడుబడకముందే స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పరిశీలించి,తగిన మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు. ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించి ప్రజాధనాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





## దసరాకు ఫించన్లు ఇస్తామని ప్రభుత్వం మోసం

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** రాష్ట్ర ప్రభుత్వం దసరాకు నూతన చేయూత పెన్షన్లు ఇస్తామని చెప్పి వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులను మోసం చేసిందని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి సారి ఆగష్టు 15న అని చెప్పి ప్రభుత్వం సెప్టెంబర్ 15న అని దాటవేసిందని గుర్తుచేశారు. దసరాకు తప్పనిసరిగా ఇస్తామని వాయిదా పెట్టినా దానిని నిలుపోకోలేకపోయిందని దీని ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నిరాశే ఎదురైందన్నారు. ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపిపి మట్టిపెల్లి శ్రీశైలం, సర్పంచ్ మేడదుల రమేష్, ఉపసర్పంచ్ పాండవుల మహేష్, ఇరుగు వేణు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/చింతలపాలెం :** గ్రామంలో మౌళిక వసతుల కల్పనకు, గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామని సర్పంచ్ కందుల రామకోటి రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ నిధులతో రూ.25లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ఆయన శంఖుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామ ప్రజలు రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలనే మెరుగైన రహదారి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు నాయకులు జంగాల పుల్లయ్య, మోర్తాల వెంకటరెడ్డి, మక్బుల్ భాషా, అబ్దుల్, అంకిరెడ్డి, వార్డు సభ్యులు రాంరెడ్డి, మస్తాన్, రియాజ్ పాల్గొన్నారు.

## మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** గ్రామంలో నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య అన్నారు. గురువారం మండలంలోని గుడిబండ గ్రామంలో ప్రకృతి వనంలో పెంచిన మొక్కలను, గ్రామంలోని రోడ్ల వెంట నాటిన మొక్కలను సంరక్షించడంలో భాగంగా మొక్కలకు నీరు పోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తమ ఇండ్ల వద్ద నాటిన మొక్కలకు, ఆయా ప్రాంతాల్లో నాటిన మొక్కలను ఆ ప్రాంత ప్రజలు ఎవరో వస్తారని చూడకుండా వాటిని సంరక్షించాలని కోరారు.



## రాజ్యాధికారంలో బిసిలకు తగిన వాటా కల్పించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడం ద్వారా వారి సేవలను స్మరించుకోవడం అభినందనీయమని, అయితే బీసీలకు రాజకీయ అధికారంలో తగిన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో అత్యంత గణనీయమైన వాటా కలిగిన బీసీలకు రాజకీయ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బీసీలను కేవలం మహనీయుల విగ్రహాల ఆవిష్కరణలు, జయంతి ఉత్సవాలకే పరిమితం చేయకుండా పాలనా యంత్రాంగంలోనూ, నిర్ణయాధికారంలోనూ సముచితమైన భాగస్వామ్యం కల్పించాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో 50 శాతం బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీల జనాభా దామాషా ప్రకారం, సామాజిక న్యాయం ప్రాతిపదికన నామినేటెడ్ పదవుల్లో తగిన అవకాశాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా త్వరలో భర్తీ చేయనున్న గవర్నర్ కోటా నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల్లో ఇద్దరు బీసీ నాయకులకు అవకాశం కల్పించి, బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అప్పుడే బహుజన వర్గాలకు రాజకీయంగా సరైన న్యాయం చేకూరుతుందని, బీసీల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

## గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని గోపాలనంద సరస్వతి మహారాజ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీస్వామి అయ్యప్ప దేవాలయంలో గోరక్షకు ప్రముఖ్ అధ్యక్షుడు చింత వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన గోసమ్మాన్ ఆహ్వాన్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. డిసెంబర్ 11న హైదరాబాద్ సచివాలయం ఎదురుగా నిర్వహించే భారీ బహిరంగ సభకు ఆర్యవైశ్యులు పదివేల మంది అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గోరక్షకు ప్రముఖ్ అధ్యక్షుడు చింత వెంకన్న కుమారుడు సుమన్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు బెలిదె శ్రీనివాస్, చల్లా లక్ష్మి కాంత్, నాగవెల్లి ప్రభాకర్, రామయ్య, తల్లాడ కృష్ణమూర్తి, బిక్కుమల్ల కృష్ణ, విజయకృష్ణ, పల్స సైదులు, మిట్టపల్లి రమేష్, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

## ఆధునిక నీటిపారుదల పద్ధతులను అవలంభించాలి



**ప్రజాపక్షం/నూతనకల్ :** ఆధునిక నీటిపారుదల పద్ధతులను అవలంభించి నీటి వృధాను అరికట్టేందుకు రైతులు కృషి చేయాలని మండల వ్యవసాయ అధికారి సైదా నాయక్ అన్నారు. గురువారం మండలంలోని దిర్శనపల్లి రైతువేదికలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని రైతుల భాగస్వామ్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు భూసార పరిరక్షణ, నీటి సంరక్షణ, ఎరువుల సమర్థ వినియోగం, సుస్థిర వ్యవసాయ పద్ధతులు, సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. భవిష్యత్తు తరాలకు భూమి సారవంతంగా ఉండేలా రైతులు ప్రకృతి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. రాబోయే ఈ యాసంగి సీజన్‌లో అధిక నీటిని వినియోగించే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలను వేసుకోవాలని సూచించారు. పెసర, మినుములు, అలసంద, వేరుశనగ వంటి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చన్నారు. నీటి వృధాను అరికట్టేందుకు తుంపర్ల సేద్యం, బిందు సేద్యం వంటి ఆధునిక నీటిపారుదల పద్ధతులను అవలంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులు వెంకన్న, సంపత్ రెడ్డి, సతీష్, రాజేష్, వెంకట్‌రెడ్డి, యాదగిరి, నారాయణ పాల్గొన్నారు.

## ముదిరాజులను బిసి-ఎ జాబితాలో చేర్చాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం గత ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన విధంగా ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీడీ నుంచి బీసీఏ లోకి తక్షణమే మార్చాలని బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ రాబిన్ హుడ్, పేద ప్రజల దేవుడు శ్రీ పండుగ సాయన్న 174వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా అత్యధికంగా ఉన్న బీసీలందరూ ఏకమై ఒకతాటిపైకి వచ్చి మన హక్కులను, రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. యువత ప్రతి ఒక్కరూ పండుగ సాయన్న ఆశయ సాధనకు నడుం బిగించి కృషి చేయాలని, సాయన్నను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.పండుగ సాయన్న ఆనాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఒక సరికొత్త బహుజన రాజ్యం స్థాపించడానికి తీవ్ర ప్రయత్నం చేశారని కొనియాడారు. బడుగు బలహీన వర్గాలన్నింటినీ ఏకం చేసి వారిని చైతన్యపరచడంలో విజయం సాధించాడని, అయితే ఓర్వలేని కొందరు భూస్వాములు ఆయనను బందీపోటు దారుడని, దొంగ అని ముద్ర వేసి పొట్టనబెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పండుగ సాయన్న ముదిరాజ్ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై ప్రతిష్ఠించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వికలాంగుల తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అహ్మద్ ఖాన్, ధర్మానాయక్, నక్క వెంకటేష్ ముదిరాజ్, సందీప్, సునీల్ క్రాంతి, విజయ్, లవన్ కుమార్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, అశోక్, కృష్ణ, వంశీ జస్వంత్, నాగరాజ్, విజయ, మౌనిక, స్వాతి, రాధిక, శ్వేత, లక్ష్మి పాల్గొన్నారు.



## కులవివక్షకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆత్మకూర్(ఎస్) మండలంలోని కోటపహాడ్‌లో దళిత మహిళలపై కులవివక్షకు పాల్పడిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఎంఎస్‌పి మాజీ జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల నాయకులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా దళిత మహిళలను కులం పేరుతో దూషించి, అవమానించడంతోపాటు బతుకమ్మ అడకుండా అడ్డుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టపక్రారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గుద్దేటి యల్లయ్య మాదిగ, చింతలపాటి చిన్నశ్రీరాములు మాదిగ, మారేపల్లి సావిత్రి మాదిగ, బోడ శ్రీరాములు మాదిగ, కనుకుంట్ల వెంకన్న మాదిగ, ఎర్ర వీరస్వామి మాదిగ పాల్గొన్నారు.

## స్వర్ణకార శంఖారావ మహాసభను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ(నార్కట్ పల్లి):** తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న శనివారం హైదరాబాద్ లోని ఎల్బీనగర్ సరూర్ నగర్ స్టేడియంలో జరిగే స్వర్ణకార శంఖారావ మహాసభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర నాయకుడు చొల్లేటి శ్రీనివాసాచారి పిలుపునిచ్చారు.మండల కేంద్రంలో మహాసభ కరపత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు,జీవోఎంఎస్ నెం.272 సవరణ,50 ఏళ్లు నిండిన వృత్తిదారులకు రూ. 5,000 పెన్షన్,బ్యాంకు అప్రైజర్లకు సమాన కమిషన్ తదితర డిమాండ్ల సాధన కోసమే ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అందోజు మహేందర్,పిన్నోజు రామాచారి,పిన్నోజు ఉపేంద్రచారి,దాసోజు నరసింహాచారి,చొల్లేటి జ్ఞానేశ్వర చారి,దాసోజు హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 4వరకు సర్వే

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఈనెల 22 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్లు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగేష్ నాయక్ తెలిపారు. సర్వేలో భాగంగా గురువారం జాజిరెడ్డిగూడెం ఏఏఎం కేంద్రాన్ని సందర్శించి, ఇంటింటికి తిరుగుతూ కుష్టు వ్యాధి అనుమానితులను గుర్తిస్తున్న ఆశా కార్యకర్తల పనితీరును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమానిత లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్వేలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రతి ఇంటిని సందర్శించి కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తిస్తారని తెలిపారు. సకాలంలో చికిత్స పొందడం ద్వారా వైకల్యాలను నివారించవచ్చని, ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ సురేష్ కుమార్, ఏఎన్ఎంలు సైదమ్మ, శకుంతల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## 26 వరకే చేయూత ఆసరా పింఛన్ల పంపిణీ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :జిల్లాలో వివిధ రకాల చేయూత,ఆసరా పింఛన్ల(వృద్ధాప్య,వితంతు,వికలాంగుల,చేనేత,కల్లుగీత,ఒంటరి మహిళా పింఛన్లు) పంపిణీని ఈ నెల 26వరకు బట్వాడా చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వై శేఖర్ రెడ్డి తెలిపారు.ఈ విషయాన్ని పింఛనుదారులు గమనించి సకాలంలో పింఛను పొందాలని కోరారు. పింఛనుదారులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు సాఫ్ట్ వేర్ ద్వారా పింఛను పొందవలసి ఉంటుంది.పింఛను మొత్తమును నేరుగా సంబంధిత పోస్టల్ శాఖ వారి వద్ద నుండి పొందవలెను.మధ్య దళారులను నమ్మవద్దుఅని పింఛను పొందుటకు ఎటువంటి సొమ్ము చెల్లించవలసిన అవసరం లేదని పేర్కొన్నారు.పింఛను మొత్తము సొమ్ము రూ.16తో సహా అడిగి తీసుకోవలెను తెలిపారు.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి** : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరుతో ఆర్ఎస్ఎస్ బిజెపి తొత్తుగా మారిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని మల్లు స్వరాజ్యం స్మారక భవనంలో బుర్ర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా మాట్లాడారు. దేశం రాజ్యాంగం కల్పించిన పౌరల ప్రాథమిక హక్కు ఓటు హక్క అని దానిని తొలగించి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని సర్‌పేరుతో ఓటర్లను జాబితా నుండి తొలగించే ప్రక్రియను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శులు వజ్జె శ్రీనివాస్, గుమ్మడవెల్లి ఉప్పలయ్య, దేవరకొండ యాదగిరి పాల్గొన్నారు.

## ముకుందంకు నివాళులు



**ప్రజాపక్షం/నకిరేకల్:** పట్టణంలోని గుడిపాటి ఫంక్షన్ హాల్‌లో 13వ వార్డుకు చెందిన రిటైర్డ్ టీచర్ బ్రహ్మదేవర ముకుందం దశదినకర్మ కార్యక్రమంలోటీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు,మాజీ కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్ వేరువేరుగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్‌రెడ్డి,కొండ జానయ్యగౌడ్,కొండ శీనుగౌడ్,బ్రహ్మదేవర రమేష్,బ్రహ్మదేవర లక్ష్మయ్య,మంచుకొండ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పట్టవా



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజా పాలనలో ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని వైద్య విధాన పరిషత్ ఉద్యోగ సంఘం జేఏసీ చైర్మన్ నల్ల సోమామల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న 17,000 మంది ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఎన్ హెచ్ ఎం జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సోమా మల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరై ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు సంఘీభావం తెలియజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.అదేవిధంగా వంద శాతం గ్రాస్ శాలరీ ఇచ్చి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించి మహిళలకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ప్రకటించాలన్నారు.దీంతోపాటు 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్లు అమలు చేసి 8 శాతం లాయల్టీ బోనస్ అందించి పీఆర్‌సి ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయిస్ డాక్టర్ హరిప్రియ,గాలి రాంబాబు, ఉపేందర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గత 10 రోజులుగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు డాక్టర్లు రమేష్, వెంకటేశం, శ్రీనివాస్, తరాల సురేష్, అనిల్, సంతోష్, నాగరాజు, మౌనిక పాల్గొన్నారు.

## చదువుతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టుదల, కృషి, నిరంతర సాధనకు చదువు తోడైతే సమాజంలో ఎంతటి ఉన్నత శిఖరాలనైనా చేరుకోవచ్చని జనయేత్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మునిర్ అహ్మద్‌షరీఫ్ అన్నారు. గురువారం ఇటీవల విడుదలైన గ్రూప్ 1 పరీక్ష ఫలితాలలో విజయం సాధించి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన ఆంజనేయులును ఆయన నివాసంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ లక్ష్యంపై స్పష్టత, కష్టపడే తత్వం, ఆత్మవిశ్వాసం ఉంటే అనుకున్న గమ్యాన్ని సులువుగా చేరుకోవచ్చని స్పష్టం చేశారు. గ్రూప్ 1 వంటి పోటీ పరీక్షలో డీఎస్పీగా ఎంపికై ఆంజనేయులు సాధించిన విజయం ఎంతోమంది నిరుద్యోగ యువతకు, కష్టపడి చదివే విద్యార్థులకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. చిన్నతనంలోనే ఆంజనేయులు తల్లి క్యాన్సర్ వ్యాధితో మరణించినా



ధైర్యం సడలకుండా చదువును కొనసాగించడాన్ని కొనియాడారు. తల్లి లేని లోటు తెలియకుండా ఆంజనేయులు చదువుకు పూర్తి మద్దతుగా నిలిచి, ఆయన లక్ష్య సాధనకు నిరంతరం తోడ్పడిన అక్క, బావలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రషీద్, ప్రశాంత్, పరమేష్, రమేష్, స్థానిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీరు వృధా...

### పట్టించుకోని అధికారులు
### లీకేజీలతో తాగునీటి వృధాపై పలుమార్లు ఫిర్యాదు ... స్పందన లేదంటున్న ప్రజలు



**ప్రజాపక్షం/నూతనకల్** : మండల కేంద్రంలోని వివిధ గ్రామాల్లో మిషన్ భగీరథ పైపుల లీకేజీల కారణంగా విలువైన తాగునీరు వృధాగా పోతుందని పెద్ద నెమిల గ్రామస్తులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. పైపుల లీకేజీల సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఇప్పటి వరకు పరిష్కారం లభించలేదని ఆరోపిస్తున్నారు. ఒక వైపు పలు ప్రాంతాల్లో తాగునీటి అవసరాలు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తుండగా మరోవైపు పైపుల లీకేజీల ద్వారా నీరు వృధాగా పోవడం పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు నిరంతరంగా సురక్షిత తాగునీటిని అందించాల్సిన వ్యవస్థలో ఇలాంటి సమస్యలు కొనసాగడం పట్ల వారు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించి లీకేజీలు ఉన్న ప్రాంతాలను గుర్తించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పైపులకు తక్షణ మరమ్మత్తులు చేపట్టి తాగునీటి వృధాను అరికట్టడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తారా లేక నీటి వృధా ఇలేగా కొనసాగుతుందా అని మిషన్ భగీరథ నీరు వృధా పట్టించుకోని అధికారులు లీకేజీలతో తాగునీటి వృధా పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదంటున్న గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



## చెర్వుగట్టు ఆలయంలో శ్యామ్ సుందర్ రెడ్డి పూజలు

**ప్రజాపక్షం/నల్లగొండ(నార్కట్ పల్లి):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాయం శ్యామ్ సుందర్ రెడ్డి గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అనంతరం స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలంతా పాడిపంటలతో సుభిక్షంగా,సుఖ సంతోషాలతో ఉండాలని,రాష్ట్రంలో మంచి వర్షాలు కురవాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు.ఆయన వెంట ఆలయ ధర్మకర్తలు కమలపల్లి మల్లేష్,గద్దగుటి యాదగిరి,ఆలయ అర్చకులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రారంభం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎన్నికలను పురస్కరించుకుని బిఆర్ఎస్ పొనుగోడు గ్రామశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటర్ నమోదు కార్యక్రమంను బిఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, నాలుగువేల నిరుద్యోగ బృతి ఇస్తామని మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక యువతను పూర్తిగా మర్చిపోయారన్నారు. చదువుకునే విద్యార్థులకు స్కూటీలు ఇస్తామని చెప్పి వారిని కూడా మభ్యపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో మేళ్లచెరువు వెంకటరమణ, రామ్ సైదులు, అనంతు కరుణాకర్ గౌడ్, రామ్ మధు, బిల్లా వెంకటేశ్వర్లు, అనంతు చంద్రయ్య, పొలంపల్లి ఆంజనేయులు, బత్తిని మహేష్, రామ్ సంపత్, మామిడి నవీన్ పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన గుంత

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల కేంద్రమైన నడిగూడెం నుండి కాగితరామచంద్రాపురం గ్రామానికి వెళ్లే మార్గమధ్యంలో రహదారిపై ఏర్పడిన గుంత రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాహనాల రాకపోకలతో రోజు రోజుకు గుంత పెద్దగా అవుతుంది. దీంతో ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. నిత్యం ఈ రహదారి గుండా వివిధ గ్రామాలకు ఎన్నో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రద్దీగా ఉండే రహదారిపై గుంత పడటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని మాజీ కోఆప్షన్ షేక్ జలీల్ అన్నారు. మండలంలోని రామచంద్రాపురం, సిరిపురం, వల్లాపురం, నారాయణపురం, ఖమ్మం, పాలేరు, కరివిరాల తదితర గ్రామాలకు వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డుపై పడ్డ గుంత రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నందున అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు జరిపించాలని జలీల్ కోరారు. లేనిపక్షంలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు.



## పండుగ సాయన్న జయంతి, వర్ధంతులకు ప్రభుత్వ సెలవులు ప్రకటించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పండుగ సాయన్న జయంతి, వర్ధంతి రోజులను ప్రభుత్వ సెలవు దినాలుగా ప్రకటించాలని బీసీ జేఏసీ నాయకులు కోలా సైదులు ముదిరాజ్ కోరారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని బీసీ భవన్‌లో పండుగ సాయన్న 174వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ డి నుండి బీసీ ఏ కి మార్చే అంశాన్ని త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలు మాట్లాడుతూ పండుగ సాయన్న గొప్పతనాన్ని కొనియాడుతూ ఆయనను ఆదర్శంగా తీసుకుని ముదిరాజులందరూ ఐక్యంగా పోరాడాలని సూచించారు. బీసీ జేఏసీ నాయకులు దాసరాజు జయరాజు ముదిరాజ్, చేగొండి మురళి యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకులు మిట్టపల్లి వెంకటేష్, కౌన్సిలర్ వెలుగు ఇందిరా నాగరాజు, డాక్టర్ జాడీ రాజు, రాములు, సైదులు, కౌన్సిలర్ మనోజ్, సత్యనారాయణ పాల్గొన్నారు.



## క్షయవ్యాధి నిర్ధారణ శిబిరం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మండల పరిధిలోని లింగగిరి పిహెచ్‌సి పరిధిలో వేపలసింగారం గ్రామంలో క్షయ నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. గురువారం 60 సంవత్సరాలపై బడిన మధుమేహం వ్యాధి లక్షణాలు ఉన్నటువంటి వారు గత ఐదు సంవత్సరాలుగా వ్యాధి ఉన్న రోగులు వారి కుటుంబ సభ్యులకు, మద్యపానం, దూమపానం అలవాటు ఉన్న వారిని పోషకాహారంలోపంతో బరువు తక్కువగా ఉన్న వారిని గుర్తించి వారి నుండి తెమడ నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం శిబియన్ ఎఎ ట్ ల్యాబ్ సూర్యాపేటకు పంపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పద్మ, టిబి నోడల్ అధికారి ఇందిరాల రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఎఎన్ఎం స్వరూప, ఆశా కార్యకర్తలు మరియమ్మ, అనిత, జ్యోతి, జాన్‌బీ పాల్గొన్నారు.

## గరిడేపల్లి మండల ఫాస్టర్స్ ఫెలోషిప్ కమిటి ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల ఫాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటిని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటి అధ్యక్షులుగా దుబాస్ యేసేపు, ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి జోసెఫ్, కార్యదర్శిగా నూకపంగు ప్రభుకిరణ్, జాయింట్ సెక్రటరీగా శ్రీకాంత్, కోశాధికారిగా బండారు సాల్మన్‌రాజు, మండల చైర్మన్‌గా అమరారపు పౌలు, గౌరవ అధ్యక్షులుగా జాకపు రాజు, కరుణాకర్‌రెడ్డి, ఇమ్మానియేలు, గౌరవ సలహాదారులుగా మీసాల పుష్పరాజ్, సుధాకర్, గాబ్రియేలు వ్యవహరించారు. ఈ సందర్బంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ ఫాస్టర్స్ సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్ దయాకర్, రాజు, పేతురు, సురేష్, రవి, నాయక్, సంసోను పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని కరివిరాల గ్రామ వాస్తవ్యులైన జల్లా వెంకన్న కుమార్తె సాయి భవిత కళాశాల ఫీజు నిమిత్తం మండల ఆర్యవైశ్య సంఘం తరుపున గురువారం 20,216 రూపాయలు గ్రామంలో వారి నివాసానికి వెళ్లి ఆర్థికసాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అర్వపల్లి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి వందనపు చంద్రమోహన్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు చల్లా వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ సహాయ కార్యదర్శి చెన్నూరు వెంకటేశ్వర్లు, చల్లా అశోక్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



# పండగ సాయన్న 174వ జయంతి వేడుకలు






**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** స్వాతంత్ర్య సమర యోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పండగ సాయన్న 174వ జయంతిని గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.దశరథ హాజరై పండగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజానికి పండగ సాయన్న చేసిన త్యాగాలు,సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన పడిన తపన తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎ.సంజీవయ్య,జిల్లా బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు,ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్,సోమ మల్లయ్య,లక్ష్మీనారాయణ,రమణ ముదిరాజ్,పి.శ్రీనివాస్,ఎన్.సత్యనారాయణ,మిర్యాలగూడ ఏబీసీడీఓ ఎస్తేర్,హాస్టల్ సంక్షేమ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల కేంద్రంలో గురువారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాబిన్ హుడ్,పోరాట యోధుడు పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు జింకల లింగస్వామి ముదిరాజ్, కుక్కల వెంకటేష్ ముదిరాజ్, డెంకాని జానయ్య ముదిరాజ్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో,నిజాం పాలనలో పేదల పక్షాన నిలిచి భూస్వాముల దోపిడీని ఎదిరించిన ధీరుడు పండుగ సాయన్న అని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా పండుగ సాయన్న చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జింకల రమేష్ ముదిరాజ్, మహేందర్,రవి,కృష్ణ,తదితర ముదిరాజ్ సంఘం సభ్యులు,యువకులు పాల్గొన్నారు.

# దసరా కిక్కు.. రూ.5.86 కోట్లు

### నకిరేకల్ అబ్కారీ పరిధిలో భారీగా మద్యం అమ్మకాలు

### 18 వైన్స్‌లు..2 బార్లలో జోరు

### మద్యం,మాంసం కొనుగోళ్లలో ప్రజలు తగ్గేదేలే



**ప్రజాపక్షం/నకిరేకల్ :** దసరా పండుగ ఆబ్కారీ శాఖకు కాసులు కురిపించింది.ఈ ఏడాది మద్యం విక్రయాలు ఘననీయంగా పెరిగాయి. పండుగకు రెండు రోజుల ముం దు నుంచి మందుబాబులు మద్యం షాపుల వద్ద బారులు తీరారు.వైన్స్‌లు, బార్లు కిటకిటలాడాయి.

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో దసరాకు ప్రత్యేక స్థానం ఉంది.బతుకమ్మ ఆటపాటలు,విజయదశమి సంబురాలతో పల్లె,పట్టణం అన్న తేడా లేకుండా పండుగ కళ ఉట్టిపడింది.ఈ వేడుకలను ప్రజలు తగ్గేదేలే అన్నట్లుగా ఘనంగా నిర్వహించారు. పండుగ వేళ మద్యం, మాంసం విక్రయాలు జోరందుకున్నాయి.చుక్క,ముక్క లేనిదే ముద్ద దిగిన పరిస్థితి..రాష్ట్రవ్యాప్తంగా మద్యం అమ్మకాలు భారీగా సాగగా..నకిరేకల్ అబ్కారీ పరిధిలోనూ తగ్గేదేలే అన్నట్టుగా ఆరు రోజుల్లో కోట్ల రూపాయల విక్రయాలు నమోదయ్యాయి.

లిక్కర్ కంటే.. బీర్లదే హవా

నకిరేకల్ అబ్కారీ పరిధిలోనకిరేకల్, కట్టంగూర్,కేతేపల్లి,శాలిగౌరారం మండలాలు ఉన్నాయి వాటి పరిధిలో 18 వైన్స్‌లు,రెండు బార్లు ఉన్నాయి. ఈ నెల16 నుంచి 21 వరకు 4,902 కేసుల లిక్కర్,9,899 కేసుల బీర్లు జోరుగా మద్యం విక్రయమయ్యాయి.లిక్కర్ కంటే బీర్ల అమ్మకాలే అధికంగా నమోదయ్యాయి. ఈ ఆరు రోజుల్లో మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఖజానానికి రూ.5,కోట్ల 86 లక్షల మూడు వేల 285 రూపాయలు ఆదాయం సమకూరింది.అదేవిధంగా యాట మాంసం కిలో రూ.1,000 నుంచి రూ. 1,200 వరకు విక్రయించగా..చికెన్ ధర కిలో రూ. 260 నుంచి రూ.280 వరకు పలికింది.ధరలు అధికంగా ఉన్నా కొనుగోళ్లలో ప్రజలు వెనక్కి తగ్గలేదు పండుగ విందుల కోసం మాంసం కొనుగోళ్లు జోరుగా సాగాయి. మొత్తంగా చుక్క, ముక్కతో దసరా వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

## చేరిపల్లి కైలాసం మృతి బాధాకరం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకుడు, కొండమల్లేపల్లి మాజీ ఎంపిటిసి చేరిపల్లి కైలాసం మృతి బాధాకరం అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన చేరిపల్లి కైలాసం అనారోగ్యంతో గురువారం ఉదయం మరణించారు. ఆయన పార్థివ దేహానికి దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ పూలమాల వేసి, నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్‌యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి ఊట్కూరి వేమన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, మాజీ రైభాసా అధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, రమావత్ రమేష్‌నాయక్ పాల్గొన్నారు.





## వాసవి మాత విగ్రహా ఊరేగింపు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో శ్రీ వాసవి మాత ఆలయంలో ప్రతిష్ఠించిన వాసవి మాత విగ్రహాం ఊరేగింపు గురువారం పట్టణంలో వైభవంగా జరిగింది. ఈసందర్భంగా మహిళలు, యువతి, యువకులు కోలాటాలు వేసి ఆట, పాటలతో అందరిని ఆకట్టుకున్నారు. ఈకార్యక్రమంలో నీల లక్ష్మయ్య, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఊరే జనార్ధన్, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్త వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దొడ్డి సుధాకర్, విడియాల రామయ్య, దుండిగళ్ళ వెంకటేశ్వర్లు, జిన్నం రామూర్తి, నీల విజయ్, ముచ్చర్ల కరుణాకర్, మారం వెంకన్న, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేకు ప్రజలంతా సహకరించాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22 నుండి నవంబర్ 4వ తేదీ వరకు నిర్వహించు కుష్ఠ అనుమానిత మచ్చల సర్వేకు ప్రజలంతా సహకరించాలని డిప్యూటి పారామెడికల్ ఆఫీసర్ మాంతగి సురేష్‌బాబు కోరారు. గురువారం పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీలో చేపట్టిన సర్వేను పర్యవేక్షించి మాట్లాడారు. శరీరంపై స్పర్శలేని తెల్లని లేదా ఎరువు మచ్చలు, కాళ్లు చేతుల్లో తిమ్మిర్లు, మొద్దుబారీ ఉండటం వంటి లక్షణాలు కలిగినట్లయితే వెంటనే మీ ఇంటి వద్దకు వచ్చే అశా కార్యకర్తలకు లేదా ఆరోగ్య సిబ్బందికి తెలియపర్చాలని, కుష్ఠ వ్యాధిపై భయపడవద్దని, స్వల్ప చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చని తెలిపారు. కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పద్మ, లెప్రసి టిబి నోడల్ అధికారి ఇందిరాల రామకృష్ణ, ఆశా కార్యకర్తలు మాలతి, వినోద పాల్గొన్నారు.

## చందంపల్లి పంచాయతీ కార్యదర్శిగా కే.ఎస్.చారి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని చందంపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా కే.ఎన్ చారి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన శాలిగౌరారం మండలం ఉప్పలంచ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. అక్కడి నుంచి డిప్యూటేషన్‌పై చందంపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా నియమితులయ్యారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశంను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు నరసింహా చారిని గ్రామ సర్పంచ్ మాచర్ల చంద్రకళ యాదగిరి ఉపసర్పంచ్ మేడబోయిన సైదులు యాదవ్,పాలకవర్గం సన్మానించారు.

## కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో గురువారం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా జన్మదినాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లను పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో భాజాపా మండల పార్టీ అధ్యక్షులు పింగళి విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సురేష్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, సాయితేజ, మండల కోశాధికారి పరమేశ్వరి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు సంగీత, గ్రామ శాఖ అధ్యక్షులు సోమచారి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.